




తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో గురువారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల తారక రామారావు, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాగంటి గోపీనాథ్, ప్రకాశ్‌గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, తదితరులు




తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

## నిమ్స్‌కు హెల్త్‌కేర్, టెక్నాలజీ విభాగం అవార్డు

ఖైరతాబాద్, డిసెంబర్ 14: నిమ్స్ దవాఖాన అందిస్తున్న వైద్య సేవలకు గుర్తింపు లభించింది. తెలంగాణ ప్రభుత్వం, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్తంగా 'ది ఈ – ఐసీయూ ప్రాజెక్టు'ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వైద్యులకు పూర్తి స్థాయిలో శిక్షణ లేకపోయినా ఈ ప్రాజెక్టు సాయంతో అత్యవసర రోగుల ప్రాణాలను కాపాడేలా చొరవ తీసుకున్నారు. 2021 సంవత్సరంలో పైలెట్ ప్రాజెక్టుగా సిరిసిల్లలో తొలి కేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలు నెలకొల్పారు. రోడ్డు ప్రమాదాలు, పాము కాటు తదితర అత్యవసర సమయాల్లో ఆ కేంద్రాలకు వచ్చిన రోగులకు ఎలాంటి చికిత్స అందించాలి, రోగి ప్రాణాలు ఎలా కాపాడాలన్న అంశాలను నిమ్స్ నుంచే నేరుగా వర్చువల్‌గా ఆయా కేంద్రాల్లోని సిబ్బందికి తెలియజేస్తారు. తద్వారా ఎందరో రోగుల ప్రాణాలను కాపాడారు. మూడేండ్ల వ్యవధిలో 7వేల మంది రోగులకు సేవలందించారు. నిమ్స్ చేస్తున్న ఈ కృషిని గుర్తించిన కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) 2023 సంవత్సరానికి గాను హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ టెక్నాలజీ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డు రావడంపై నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప వైద్యులను అభినందించారు. ఈ ప్రాజెక్టులో కీలకంగా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ పద్మజాను ప్రత్యేకంగా అభినందించారు.

## గర్భిణికి లాపరోటమీ శస్త్ర చికిత్స

### తల్లీబిడ్డా క్షేమం



చికిత్స అనంతరం పూర్తిగా ఆరోగ్యంగా ఉన్న తల్లీ, బిడ్డ

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 14 : సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన వైద్యులు గర్భిణికి అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి తల్లీబిడ్డలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన డి.రేణుక(36), డి.కోటప్ప భార్యాభర్తలు. కాగా నాల్గవ కాన్పు నిమిత్తం రేణుక ఈ నెల 11న సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో చేరింది. అప్పటికే గర్భిణి తీవ్ర రక్త స్రావం, కడుపునొప్పితో బాధపడుతున్నది. పరిశీలించిన దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కె.రాజ్యలక్ష్మి లాపరోటమీ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డను కాపాడారు.

## టీకాలపై నిర్లక్ష్యం వద్దు

### జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటేశ్వర్‌రావు

సిటీబ్యూరో, డిసెంబరు 14 (నమస్తే తెలంగాణ) : చిన్నారులకు ఇవ్వనున్న టీకాలపై వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, చిన్నారులందరికీ తప్పనిసరిగా అన్నిరకాల టీకాలు వేయించాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం డీఎం అండ్ హెచ్ఓ కార్యాలయంలో టీకాలపై వైద్యసిబ్బందికి నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా తల్లిదండ్రులను చైతన్యపర్చాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించుకొని అమలుపర్చాలని వైద్యసిబ్బందికి సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా ఉండేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ హైదరాబాద్ ప్రతినిధి డా.ఎం.ఎ.అజహర్ మాట్లాడుతూ టీకా పంపిణీ కార్యక్రమంలో వైద్యాధికారులు, పారామెడికల్ సిబ్బంది పాటించాల్సిన సాంకేతిక విధానాలు, ఆధునిక పద్ధతులు, పిల్లల వ్యాధులను గుర్తించే పరిజ్ఞానం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం..



అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, డిసెంబర్14: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన తీగుళ్ల పద్మారావు గౌడ్ గురువారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యేగా పద్మారావు గౌడ్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ పద్మారావు గౌడ్‌తో ప్రమాణం చేయించారు. 2014 నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికై సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్ సాధించారు. 2004లో పద్మారావు గౌడ్ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. అప్పటి ఎన్నికల్లో ఆయనకు 3067 ఓట్ల మెజారిటీ వచ్చింది. అనంతరం, 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రతి ఎన్నికల్లో ఆయన మెజారిటీ పెరుగుతూ వచ్చింది. తాజాగా 45, 240 ఓట్ల ఆధిక్యతను సాధించి సికింద్రాబాద్‌లో హ్యాట్రిక్‌తో ఎమ్మెల్యేగా రికార్డు నెలకొల్పారు.

## ఎమ్మెల్యేగా రాజాసింగ్ ప్రమాణ స్వీకారం



అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేస్తున్న గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.రాజాసింగ్

*- అబిడ్స్, డిసెంబర్ 14*

## పది విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్

- ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చేందుకు చర్యలు
- ప్రధానోపాధ్యాయులకు డీఈవో ఆదేశాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మార్చిలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులు అత్యంత మెరుగైన ఫలితాలు సాధించే విధంగా డీఈవో చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని డిప్యూటీ విద్యాధికారులు, మండల విద్యాధికారులతో పాటు ప్రధానోపాధ్యాయులతో చర్చలు జరుపుతున్నారు. ఇప్పటినుంచే ఆయా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని తెలిపారు. పది ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం మెరుగు పర్చడం కోసం పీఆర్‌టీయూ, యూటీఎఫ్, ఎస్టీయూతో పాటు పలు రకాల ఉపాధ్యాయ సంఘాలు కూడా కృషి చేస్తున్నాయని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

## ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : దిల్‌సుఖ్‌నగర్‌లోని సంస్కృతి స్కూల్‌లో గురువారం ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఫైర్ సేఫ్టీపై మాక్ డ్రిల్ చేపట్టి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తే వారి జీవితకాలం భద్రత నైపుణ్యాలు అలవర్చుకుంటారని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఇతరులపై ఆధారపడకుండా తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. ప్రధానంగా రాబోయే వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

## ఈవీడీఎం కార్యాలయాన్ని సందర్శించిన ఆస్ట్రేలియన్ కాన్సులెట్



సిటీబ్యూరో,డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ ) : కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన డిప్యూటీ కాన్సులెట్ జనరల్ బ్రయాన్, బెంగళూరు ప్రొటోకాల్ ఆఫీసర్ సయ్యద్ గురువారం జీహెచ్ఎంసీ ఈవీడీఎం కార్యాలయాన్ని సందర్శించారు. బుద్ధభవన్‌లో వారిని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరదలు, అగ్ని ప్రమాదాలు, విపత్తుల నివారణలో ఈవీడీఎం విభాగం తీసుకుంటున్న చర్యలను వారికి ప్రకాశ్‌రెడ్డి వివరించారు.

## 16న నెక్లెస్ రోడ్‌లో 5కె రన్, చిన్న నాటి ఆటలు

రవీంద్రభారతి, డిసెంబర్ 14: తెలంగాణ అమెరికా తెలుగు సంఘం(టీటీఏ) ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 16న ఉదయం ''నాటి ఊరు.. ఆ రోజుల్లో'' పేరిట 5కె రన్ నక్లెస్‌రోడ్డులోని పీపుల్స్ ప్లాజా వద్ద నిర్వహిస్తున్నామని అవసరం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కాంత్, టీటీఏ కో–ఆర్డినేటర్ డా.ద్వారకానాథ్‌రెడ్డి, అంతర్జాతీయ క్రీడాకారుడు బికాస్కారార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ యువతి యువకులు చిన్ననాటి ఆటలు మరిచిపోతున్నారని, అంతరించిపోతున్న ఆటలను తిరిగి సమాజానికి తెలియజేయడానికి వీలుగా ఆ రోజు మధ్యాహ్నం నుంచి యువతి యువకులకు గిల్లిదండ, గోలీలు, బొంగరం, తొక్కుడు బిళ్ళ, అష్టా చెమ్మ, కచ్చకాయలు, రింగ్, ఓముడు గుంటలు, జంగ్లింగ్, తదితర ఇండియన్ ట్రేడిషనల్ గేమ్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నేటి తరం పిల్లలకు ఈ ఆటలను పరిచయం చేయడం కోసం తాము కృషిచేస్తున్నామని తెలిపారు.

## ఎర్రగడ్డలో 16న జాబ్ మేళా




వివరాలు వెల్లడిస్తున్న సంస్థ ప్రతినిధులు

అమీర్‌పేట్, డిసెంబర్ 14: జాతీయ ఉపాధి కల్పన విభాగం, తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన విభాగాల ఆధీనంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా చర్చి ఆవరణలోని డాన్ బాస్కో సేవా కేంద్రం సహకారంతో ఈ నెల 16న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎన్‌సీఎస్ ప్రతినిధి విజయ్ గురువారం వెల్లడించారు. ఈ 16న ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న చర్చి ఆవరణలో బాస్కో సేవా కేంద్రం డైరెక్టర్ ఫాదర్ పి.శరత్‌బాబు నేతృత్వంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాకు 10, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉన్నత కోర్సులు చేసిన వారు హాజరు కావచ్చని, ఈ మేళాకు 98 పర్సెంటిన్, వీఎల్‌ఆర్ ఫెసిలిటేషన్స్, యాక్ట్ ఫైబర్ నెట్, వెట్రోటెక్ సొల్యూషన్స్, డాన్‌బాస్కో లైఫ్, స్నైడర్ ఎలక్ట్రికల్స్ వంటి సంస్థలు అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తారని బాస్కో ప్రతినిధులు ఐవన్ వాజ్, డానియెల్ తెలిపారు. మరిన్ని వివరాలకు 8977175394, 9494698219లలో సంప్రదించాలన్నారు.